క్లుప్తంగా

కలెక్టర్ దృష్టికి పలు సమస్యలు

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని పలు సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ నాయకులు భూపేష్ గోపినాథ్ కలెక్టర్ కోరారు. ఆయన సోమవారం కలెక్టర్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు. సంతపేట వద్ద నీవా నది ప్రక్షాళనకు అనుమతి ఇవ్వాలని కోరారు. అలాగే ఆయన పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

వినాయకుని సేవలో శైలజచరణ్ రెడ్డి



వినాయకుని సేవలో శైలజచరణ్ రెడ్డి కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారిని స్త్రీ శిశు సంక్షేమ శాఖ రాయలసీమ జోనల్ చైర్‌పర్సన్ శైలజ చరణ్ రెడ్డి సోమవారం దర్శించుకున్నారు. ఆమె కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయాధికారులు స్వాగతం పలికి, స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

14న పూతలపట్టులో జాబ్‌మేళా

రేణిగుంట: పూతలపట్టు మండలం పేటమిట్టలోని అమరరాజ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఈనెల 14న ఉదయం 10 గంటలకు పూతలపట్టు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు అమరరాజ యాజమాన్యం తెలిపింది. టెన్త్, ఇంటర్ చదివిన నిరుద్యోగ యువతీ యువకులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరింది. ఎంపికైన వారికి మల్టీ స్కిల్ టెక్నీషియన్ కింద 2 సంవత్సరాలు శిక్షణ ఇస్తామని, శిక్షణానంతరం మూడు నెలలు హాస్టల్, భోజన వసతి కల్పించి, రూ.7500 స్టైఫండ్ ఇస్తామని, తదుపరి కంపెనీలో ఉద్యోగ శిక్షణకు తీసుకున్నాక రూ.11,640 వేతనం ఇవ్వనున్నట్టు పేర్కొంది. ఇతర వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు : 9000024919, 9100477371

నేడు విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక మురకంబట్టులో మంగళవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. రోడ్డు విస్తరణ పనుల దృష్ట్యా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు చెప్పారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

పూతలపట్టు : మండలంలోని కోట్లపల్లెలో సోమవారం వేము ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. సేంద్రియ సాగుతో కలిగే లాభాలను వివరించారు. దిగుబడి, నాణ్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రసాయనిక మందుల వాడకంతో కలిగే అనర్థాలపై రైతులకు పలు విషయాలను తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిత్తూరు అర్బన్: బంగారుపాళ్యం మండలంలో సోమవారం ఎస్‌ఈబీ అధికారులు దాడులు చేసి టేకుమందకు చెందిన శేఖర్(25) నుంచి 20 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ మోహన్‌బాబు, సిబ్బంది సుబ్రమణ్యం, కిరణ్, మమత, క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఎస్‌తో రక్షణ

యాదమరి: ఓఆర్ఎస్ ద్రావణంతో వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా రక్షణ పొందవచ్చని సీహెచ్ఓ లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం ఓఆర్ఎస్ ద్రావణం ఎలా తీసుకోవాలనే అంశంపై యాదమరి ప్రభుత్వ వైద్యులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఉదయం ఎర్రచేను గ్రామంలో వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా ఉండాలంటే తప్పని సరిగా ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రి సిబ్బంది వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంటాయని వాటిని ఒక లీటరు నీటిలో కలిపి తీసుకోవాలని కోరారు.

కంటి ఆపరేషన్లకు 30 మంది ఎంపిక



కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 30 మంది ఆపరేషన్లకు ఎంపికైనట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి విచ్చేసిన 45 మంది రోగులకు పరీక్షలు చేశారు. అందులో 30 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ఎంపికైన వారిని చెన్నైకి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించి, మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

బీమా...ధీమా!

- పేదలకు వైఎస్సార్ బీమా సదుపాయం
- రైస్ కార్డు ఉంటే బీమా
- ప్రభుత్వమే ప్రీమియం చెల్లింపు
- నేటితో రెన్యూవల్‌కు ఆఖరు



బీమా సర్వేలో వలంటీర్

చిత్తూరు రూరల్: కుటుంబ భద్రతలో భాగంగా ప్రస్తుతం ప్రతి ఒక్కరూ జీవిత బీమాకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆదాయ వర్గాలు ఉన్నవారు మాత్రం బీమా పాలసీలు కడుతున్నారు. పేదలు మాత్రం కనీస బీమా లేక భద్రత లేకుండా బతుకుతున్నారు. ఈ క్రమంలో పేద కుటుంబాలకు అండగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రెండేళ్ల క్రితం వైఎస్సార్ బీమా పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది క్షేత్రస్థాయిలో రెన్యూవల్ సర్వే ప్రారంభించింది. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి రైస్ కార్డు కుటుంబాల వివరాలను సేకరించి సర్వే చేస్తున్నారు.

నమోదు ఇలా...

బీమా పథకాన్ని వైఎస్సార్ క్రాంతి పథం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో చేస్తున్నారు. మండలంలో 8,444 వేల మంది బియ్యం కార్డుదారులు ఉన్నారు. ఇందులో 7,765 మంది కార్డుదారులు వైఎస్సార్ బీమా పథకానికి అర్హత కలిగి ఉన్నారు.. ప్రస్తుతం వీరి రెన్యూవల్ ప్రక్రియ శరవేగంగా జరుగుతోంది. లబ్ధిదారుల వేలిముద్ర, ముఖ, కంటి ఆధారంగా, ఓటీపీ ఆధారంగా వలంటీర్లు రెన్యూవల్ చేయిస్తున్నారు. ఆదివారం వరకు 4,917 మంది వివరాలు సేకరించారు. మంగళవారం వరకు గడువు ఇవ్వడంతో వందశాతం పూర్తి చేయాలనే లక్ష్యంతో 17 గ్రామ పంచాయతీల పరిధిలోని 9 సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, కార్యదర్శుల పర్యవేక్షణలో సర్వే జరుగుతోంది.

వంద శాతం లక్ష్యంతో...



వైఎస్సార్ బీమా పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి ఒక్కరూ విధిగా రెన్యూవల్ చేయించుకోవాలి. వలంటీర్లు ఇళ్ల వద్దకే వస్తారు. ఒకవేళ బయటి ప్రాంతాల్లో ఉంటే ఓటీపీ ఆధారంగా చేసుకోవచ్చు. ఈ విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండరాదని, వంద శాతం పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చాం. మంగళవారం సాయంత్రానికి సర్వే పూర్తి కావాలి. –రాఘవేంద్ర వర్మ, ఎంపీడీఓ, చిత్తూరు

పథకానికి అర్హత ఇలా...

- బియ్యం కార్డుదారుడై ఉండాలి. ఇంటిలో సంపాదించే వ్యక్తికి బీమా లభిస్తుంది.. భార్య, పిల్లలు, వృద్ధులైన తల్లిదండ్రులు నామినీగా ఉంటారు.
- భర్త చనిపోయిన చోట ఆయన భార్యే కుటుంబాన్ని పోషిస్తే భార్య పేరిట బీమా ఉంటుంది. పిల్లలు, వృద్ధులు నామినీగా ఉంటారు.
- గ్రామీణ ప్రాంతాల్లోని వారి నెలకు ఆదాయం రూ.10వేలు, పట్టణ ప్రాంతాలైతే రూ. 12 వేలు ఉండాలి.
- మాగాణి భూమి మూడెకరాలు లేదా మెట్ట భూమి పదెకరాల కన్నా తక్కువ ఉన్నవారు అర్హులు.
- పాలసీదారులకు గుర్తింపు కార్డును ప్రభుత్వం విడుదల చేస్తుంది.

ప్రయోజనాలు ఇలా..

- వైఎస్సార్ బీమా పథకానికి 18 నుంచి 70 ఏళ్ల లోపు కలిగిన బియ్యం కార్డుదారులు అర్హులు.
- వీరు 18 నుంచి 50 ఏళ్ల మధ్య సహజ మరణం పొందితే నామినీకి రూ.లక్ష బీమా మొత్తం వస్తుంది.
- ప్రమాదవ శాత్తూ మరణించినా.. పూర్తి అంగవైకల్యం పొందినా రూ. 5 లక్షల బీమా లభిస్తుంది.
- 51 నుంచి 70 ఏళ్ల వయస్కులు ప్రమాదంలో మరణించినా లేక పూర్తి అంగవైకల్యం పొందినా రూ.5 లక్షల బీమాను వారసులకు చెల్లిస్తారు.

‘ఆ టీచర్లు వద్దంటూ ఆందోళన’

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలంలోని సిద్ధంపల్లె ఉన్నత పాఠశాలలో టీచర్ల మధ్య ఆధిపత్యపోరు తారస్థాయికి చేరింది. ఉపాధ్యాయుల పంతానికి సోమవారం తల్లిదండ్రులు, పిల్లలు రోడ్డెక్కారు. ఆ టీచర్లు వద్దంటూ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. వివరాలు..సిద్ధంపల్లె ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య వర్గపోరు 5 ఏళ్లుగా కొనసాగుతోంది. ఇద్దరి టీచర్ల మధ్య మొదలైన గొడవ చిలికిచిలికి గాలివానలా మారింది. దీనికి తోడు స్కూల్ ఎన్నికలలో దాతగా పెత్తనం చెలాయిస్తున్న వ్యక్తి వ్యవహరిస్తున్న తీరు వెరసి ఇక్కడ వర్గపోరుకు మరింత ఆజ్యం పోసింది. మూడు నెలలకు క్రితం డీవైఈఓ స్కూలుకు వచ్చిన టీచర్లను హెచ్చరించినా వారు తీరు మారలేదు. ప్రధానంగా హెచ్‌ఎంను స్కూల్ నుంచి పంపించాలని ఓ టీచర్ పిల్లల తల్లిదండ్రులను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. పిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని హెచ్‌ఎంపై నూరిపోశారు. దీంతో తల్లిదండ్రులు ఊగిపోయి టీచర్లు వద్దంటూ ఆందోళనకు దిగారు. ఉన్నతాధికారులు టీచర్లపై బెత్తం ఝుళిపించి, స్కూలు దారిలో పెట్టాలని పలువురు కోరుతున్నారు.

పల్లెల్లో ఎంఎల్‌హెచ్‌పీలే కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఓ రవిరాజు

చిత్తూరు రూరల్: పల్లెటూళ్లలో ఎంఎల్‌హెచ్‌పీలే కీలమని డీఐఓ రవిరాజు అన్నారు. చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం ఎంఎల్‌హెచ్‌పీలకు ప్రథమ చికిత్స, పాము కాటు వైద్యంపై 4వ విడత శిక్షణ కార్యక్రమాన్ని డీఐఓ ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా ఎంఎల్‌హెచ్‌పీలు పనిచేయాలన్నారు. మాతా–శిశు మరణాలు, సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల నివారణకు కృషి చేయాలన్నారు. పాము, తేలు, కుక్కకాట్లకు తక్షణం ప్రథమ చికిత్స అందించాలన్నారు. మధుమేహం, అధిక రక్తపోటు, క్షయ, కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించి తగిన వైద్యం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అధికారులు రవికుమార్, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీపీ జన్మదిన వేడుకలు



ఎంపీపీతోపాటు అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే

గుడిపాల: ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి జన్మదిన వేడుకలు గుడిపాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు భారీ కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యేతోపాటు చిత్తూరు మేయర్ అముద, డెప్యూటీ మేయర్ చంద్రశేఖర్, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, చిత్తూరు మండల సీపీ అధ్యక్షుడు త్యాగరాజులతో పాటు పలువురు ప్రసాద్‌రెడ్డిని సన్మానించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, వెలుగు సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ అమరావతి

బంగారుపాళెం: అధికారులు, ప్రజా ప్రతినిధులు మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ అమరావతి అన్నారు. ఎంపీపీ అమరావతి అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సభ్యులు పలు అంశాలపై చర్చించారు. ఆమె మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు సంబంధించి వెలుగు ద్వారా రుణాలను అందజేయాలన్నారు. సచివాలయ భవనాల బిల్లులను సకాలంలో అందించాలని కోరారు. అలాగే గత సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, తహసీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీఓ హరిప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా జగనన్న పాలన



పీడీవీ కండ్రిగలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు.

- ఎమ్మెల్యే బాబు

బంగారుపాళెం: ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని నలగాంపల్లె సచివాలయం పరిధిలోని ఎస్‌పీ నగర్ దళితవాడ, పీడీవీ కండ్రిగ, కేసీ కండ్రిగ, దళితవాడ, ఆదిఆంధ్ర వాడ గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను, ఇప్పటి వరకు ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను తెలుసుకున్నారు. ఎస్‌పీ నగర్ సమీపంలోని మామిడి జూస్ ఫ్యాక్టరీ వ్యర్థ జలాలను గ్రామంలో నిర్మించిన కాలువలోకి వదిలివేశారన్నారు. కాలువ ఇళ్ల మధ్యలో వెళుతుండంతో దుర్వాసనతో ఇళ్లల్లో ఉండలేక పోతున్నామన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు పొందేందుకు ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే సచివాలయాలను ఏర్పాటు చేశారన్నారు. లబ్ధిదారుల ఇంటికే వెళ్లి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందించేందుకు వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీషరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకుడు ప్రభునాయుడు, పార్టీ జిల్లా కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి, యూత్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్ర, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నాగరాజ, ఎంపీడీఓ హరిప్రసాద్, తహసీల్దార్ బెన్నురాజ్ పాల్గొన్నారు.

ఆధార్ నమోదు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పూతలపట్టు: మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు 0–5 ఏళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదు ప్రక్రియను తప్పక చేయాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. సోమవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు విధుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. మండలంలో 303 జనన ధ్రువ పత్రాలు అందజేస్తే వాటిలో 157 మందికి మాత్రమే ఆధార్ నమోదు ప్రక్రియ చేసి ఉన్నారన్నారు. మిగిలినవి ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. పని తీరు మెరుగు పరుచుకోవాలన్నారు. వీలైనంత త్వరగా ఆధార్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. సూపర్‌వైజర్ నాగరత్న పాల్గొన్నారు.

‘స్పందన’ ఫిర్యాదులు పరిష్కరించాలి



అర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: స్పందన కార్యక్రమంలో భాగంగా అందే వినతులను వేగంగా పరిష్కరించాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. వినతులను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలని, సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కమిషనర్ అన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ 1, రెవెన్యూ 1, ప్రజారోగ్య విభాగం 1 చొప్పున వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఇన్‌చార్జి ఎంఈ వెంకట ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ సుశీలమ్మ తెలిపారు. సోమవారం తవణంపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. స్పందనలో రామానాయుడుపాళెం వద్ద దారి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. రేషన్‌కార్డులు మంజూరు చేయాలని అర్జీలు సమర్పించారు. స్పందనలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని ఆమె సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రెడ్డిబాబు, వ్యవసాయాధికారి జి. ప్రవీణ్, హౌసింగ్ ఏఈ శ్రీధర్, అరగొండ ట్రాన్స్‌కో ఏఈ కిషోర్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

‘ఫ్యామిలీ డాక్టర్’ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



గుడిపాల: రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ పవన్‌కుమార్



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

గుడిపాల: మండలంలోని నారగల్లులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ పవన్‌కుమార్ 65 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భవతులు, బీపీ, మధుమేహ వ్యాధి గ్రస్తులను పరీక్షించి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సుమతి, హైమావతి, గీత, తమరై పాల్గొన్నారు.

పాలకల–1లో..

ఐరాల: మండలంలోని పాలకల–1లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ 104 వైద్య శిబిరంలో 65 మంది రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. పీహెచ్‌ఎన్ జీవకళ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలన్నదే లక్ష్యం



బంగారుపాళెంలో కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ప్రజాప్రతినిధులు

బంగారుపాళెం: విద్యార్థులు సమాజంలో ఉన్నతంగా ఎదగాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు నాలుగో విడత జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీరించి అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. జెడ్పీమాజీ చైర్మన్ కుమార్‌రాజా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మఒడి పథకం పేద విద్యార్థులకు వరమన్నారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువులకు భరోసా కల్పించడమే ధ్యేయంగా సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. ఎంఈఓ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ మండలంలో 5900 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేసినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు, ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.3 వేలు, రూ. 2వేలు, రూ. వెయ్యి నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, సర్పంచ్ ఉమాదేవి, ఎంపీటీసీ సభ్యురాలు ఉషా, సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, నాయకులు కృష్ణమూర్తి, మహేంద్ర, నాగరాజ, కోఆప్షన్ సభ్యుడు ఫిరోజ్‌అహ్మద్, తహసీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీఓ హరిప్రసాద్, హెచ్‌ఎం రాజేంద్ర పాల్గొన్నారు.

విద్యతోనే సామాజిక వికాసం

ఐరాల: విద్యతోనే వ్యక్తిగత పురోభివృద్ధి, సామాజిక వికాసం సాధ్యమని ఎంపీపీ మోహన్ అన్నారు. సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న విద్యాకానుకు పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సురేష్‌రెడ్డి, సురేంద్రయాదవ్, పీసీ చైర్మన్ రవీంద్రరెడ్డి, సభ్యులు నందకుమార్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

పేద, మధ్య తరగతి విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సదుపాయాలు కల్పించారని మహిళ, శిశు సంక్షేమ శాఖ రాయలసీయ రీజినల్ చైర్‌పర్సన్ శైలాజచరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కాణిపాకం జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం చంద్రశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో విద్యా కానుక కిట్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ విశ్వనాథరెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కాణిపాకంలో కిట్లను పంపిణీ చేస్తున్న శైలాజచరణ్‌రెడ్డి



ఐరాలలో కానుక అందిస్తున్న ఎంపీపీ మోహన్



తవణంపల్లెలో కిట్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ శంకరయ్య, హెచ్‌ఎం శ్రీరంజని



అరగొండలో..

పూతలపట్టులో..

పూతలపట్టు: మండలంలోని 3,432 మంది విద్యార్థులకు తొలిరోజే జగనన్న విద్యా కానుకలు అందాయని ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గౌరి, ఎంఈఓ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, సచివాలయ కన్వీనర్ సుధాకర్ రెడ్డి, వైస్‌ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, పంచాయతీ ప్రెసిడెంట్ బాబురెడ్డి, షణ్ముగం పాల్గొన్నారు.

కిట్ల పంపిణీ

యాదమరి:మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు జగనన్న విద్యాకానుకలను పంపిణీ చేశారు. మండలంలోని ప్రాథమిక పాఠశాలలు 54, ప్రాథమికోన్నత పాఠశాలలు 10, ఉన్నత పాఠశాలలు 7 ఉండగా మొత్తం పాఠశాలలో 4,036 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి ఆయా పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు జగనన్న విద్యాకానుకలను పంపిణీ చేశారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

తవణంపల్లె: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తవణంపల్లె ఎంఈఓ శంకరయ్య అన్నారు. సోమవారం తవణంపల్లె ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. తవణంపల్లె హెచ్‌ఎం శ్రీరంజని, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ హరికృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సి. హరిరెడ్డి, నాయకులు కిషోర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రంజిత్‌రెడ్డి, మధుకుమార్, దేవరాజులు పాల్గొన్నారు.



పూతలపట్టు: కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు



యాదమరి: కె.గొల్లపల్లెలో కిట్లు పంపిణీ చేస్తున్న పాఠశాల హెచ్‌ఎం లలిత

ఘనంగా ప్రపంచ కార్మికుల దినోత్సవం



ప్రపంచ కార్మికుల దినోత్సవం నిర్వహిస్తున్న న్యాయవాదులు

పలమనేరు: పట్టణ సమీపంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో స్థానిక న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు కార్మికుల చట్టాలపై అవగాహన కల్పించారు. కార్మికులను యాజమాన్యం వేధిస్తే ఇబ్బందులు తప్పవని సూచించారు. కార్యక్రమంలో ఏపీపీ రంజిత్‌షా, న్యాయవాదులు రవి తదితరులు పాల్గొన్నారు.